సర్కారు మోసం చేస్తోంది



ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి సర్కారు వైద్య విద్యార్థులను మోసం చేస్తోంది. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలన్న ఆలోచన దుర్మార్గం. ఈ నిర్ణయం వల్ల ఎంతో మంది నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారు. భవిష్యత్‌లో వైద్య సేవలు కూడా అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉంది. మెడికల్ కళాశాలలకు వచ్చిన సీట్లు వెనక్కు తీసుకోవడం దారుణం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలి.

-వనమ్మ, విద్యార్థి తల్లి, చిత్తూరు



కళాశాలలను పూర్తి చేయాలి



వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేయడం చంద్రబాబు ప్రభుత్వానికి తగదు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో పేద విద్యార్థులు చదువుకోలేరనే ఉద్దేశంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 వైద్య కళాశాలల నిర్మాణాలను ప్రారంభించింది. ఇందుకోసం రూ.8,480 కోట్లు కేటాయించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలకు మంజూరైన సీట్లు వద్దంటూ ఎన్‌ఎంసీకి లేఖ రాయడం దుర్మార్గం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని గతంలో శ్రీకారం చుట్టిన కళాశాలలను పూర్తి చేయాలి.

-మోహన్, పుంగనూరు



సూపర్ సిక్స్‌కు మంగళం

- సూపర్‌సిక్స్ హామీలను తలుచుకుంటే భయమేస్తోందని సీఎం చంద్రబాబు నిర్వేదం
- ఎన్నికల ముందు ఆరు పథకాలపై కూటమి వాగ్దానం
- గద్దెనెక్కి 100 రోజులు పూర్తి కావస్తున్నా.. అప్పుడే కూటమి ప్రభుత్వం జీద ఏడుపులు
- తల్లికి వందనం నగదు కోసం దండం పెట్టి అడుగుతున్న తల్లులు
- రైతన్నలకు పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో సాగుకు నోచుకోని పంటలు
- కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలంటున్న ప్రజలు

ఒక్కో పథకం రాష్ట్ర ప్రజల స్థితిగతులను మార్చేస్తుందన్నారు. కానీ ఒక్కరి తలరాత మారేలా కనిపించడం లేదు. తమను అధికారంలోకి తీసుకొస్తే సూపర్‌సిక్స్ హామీలు అమలు చేసి అందరికీ భరోసా కల్పిస్తామన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఈ నెల 20వ తేదీకి 100 రోజులు పూర్తి కావస్తున్నా.. ఒక్క పథకం అమల్లోకి తెచ్చుంటే ఒట్టు ఈ కూటమి పాలకులు. తల్లికి వందనం అన్నారు.. ఇప్పుడు తల్లులంతా దండం పెట్టి అడుగుతున్నా ఇచ్చేలా లేరు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎప్పటి నుంచి కల్పిస్తారో తెలియడం లేదు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల చొప్పున పంటల సాగుకు పెట్టుబడి సాయం అందిస్తామన్న హామీని గాలికి వదిలేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, అంతవరకు వారికి నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పారు. అది ఎప్పటి నుంచి ఇస్తారో ఇచ్చిన చంద్రబాబుకే ఎరుక. ఇక అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం హామీ ఈ ఏడాది ఇవ్వలేమంటూ స్వయాన మంత్రి నాదెండ్ల మనోహర్ తేల్చి చెప్పారు. ఇక ప్రతి మహిళకు నెలకు రూ.1500 అని చెప్పిన హామీ అమలు ఎప్పుడో ఇంకా తేల్చలేదు.

– చిత్తూరు అర్బన్/కాణిపాకం



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో అర్హులైన మహిళలు


2,45,153 / 1,25,789

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్

వైఎస్ జగన్ పాలనలో ఏడాదికి అర్హులకు అందిన మొత్తం

రైతు భరోసా పథకం

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
చిత్తూరు	22.56
పూతలపట్టు	51.36



కూటమి ప్రభుత్వం ఏడాదికి లబ్దిదారులకు ఇవ్వాల్సిన మొత్తం

అన్నదాత సుఖీభవ పథకం

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
చిత్తూరు	33.42
పూతలపట్టు	76.09

అమ్మఒడి

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
చిత్తూరు	34.33
పూతలపట్టు	27.10



తల్లికి వందనం

నియోజకవర్గం	లబ్ధి (రూ. కోట్లలో)
చిత్తూరు	39.61
పూతలపట్టు	31.27



ప్రతి మహిళకు నెలకు రూ.1500

మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో అర్హులైన మహిళల సంఖ్య:

1,25,789

వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం

రూ.28.04 కోట్లు



యువతకు నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి

మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో అర్హులైన యువత

1,20,909

వీరికి నెలకు ఇవ్వాల్సిన భృతి / వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం

రూ.24.00 కోట్లు



ప్రతి ఇంటికి 3 గ్యాస్ సిలిండర్లు

మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో అర్హుల సంఖ్య:

1,32,145 / 3,24,709

ఎప్పుడిస్తారో చెప్పట్లేదు..



గతంలో జూన్ నెల విద్యా సంవత్సరం ఆరంభంలోనే అమ్మఒడి కింద రూ.13వేలు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. తాము గెలిస్తే తల్లికి వందనం పేరుతో రూ.15 వేల చొప్పున ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి నగదు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇస్తామంటున్నారు. కానీ ఎపుడిస్తారో చెప్పడంలేదు. స్కూల్లో ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. కొత్తగా అప్పులు చేయాల్సి వస్తోంది.

- షాలిని, చిత్తూరు మండలం

పెట్టుబడి సాయం అందించాలి



కొత్త ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు గడుస్తున్నా రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరుణంలో ఎన్నికల హామీ మేరకు రూ.20 వేలు పెట్టుబడి సాయం సత్వరమే ఇవ్వాలి. పెట్టుబడి సాయం లేక విత్తు పడలేదు. వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుముఖం పట్టడానికి పెట్టుబడి సాయం అందకపోవడం కూడా ఒక కారణమే.

- శ్రీనివాసులు రెడ్డి, సీవీ పల్లె, ఐరాల

నిరుద్యోగభృతి కావాలి



ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, అంతవరకు రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇస్తామని మాట ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 100 రోజులు కావొస్తున్నా ఇంకా మాలాంటి చదువుకున్న యువకులను పట్టించుకోలేదు. వీలైనంత త్వరగా మాకు నిరుద్యోగ భృతిని అందించాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం. లేకపోతే ఉద్యోగాలు అయినా కల్పించండి.

- భరత్, పూతలపట్టు మండలం

ఒక్క పథకం అమలు చేయలేదు



గత ప్రభుత్వంలో స్కూళ్లు ప్రారంభం కాగానే అమ్మఒడి పథకం నగదు అందేది. ఆ డబ్బులతో మా పిల్లోడి ఫీజు కట్టేవాళ్లం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇంతవరకు తల్లికి వందనం పథకం అమలు చేయలేదు. భవిష్యత్తులో ఈ పథకం అమలు ఎలా ఉంటుందో తెలియదు. గత ప్రభుత్వం ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడ చదివినా సాయం అందించింది. మా పిల్లలు ఇద్దరు ఓ ప్రైవేట్ స్కూల్లో చదువుతున్నారు. ఈ ప్రభుత్వం అలా ఇస్తుందో ఇవ్వదో తెలియదు.

- రోజా, వడ్డిపల్లె, ఐరాల

క్లుప్తంగా

కాణిపాకంలో 'స్వచ్ఛత హీ సేవ'

ఐరాల/తవణంపల్లె: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ పరిసరాల్లో బుధవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. చెత్తాచెదారాలను తొలగించారు. ఏఈఓ కృష్ణారెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం

ఐరాల: మండలంలోని చిన్నవెంకటంపల్లె దళితవాడలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలోని గణపతి ప్రతిమను బుధవారం వైభవంగా నిమజ్జనం చేశారు.

పరిశుభ్రతపై అవగాహన

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లెలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ పౌర్ణమి

తవణంపల్లె: అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం శ్రావణ పౌర్ణమిని వైభవంగా నిర్వహించారు. అర్చకులు భక్తిప్రపత్తుతో స్వామికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో శాస్త్రోక్తంగా సుదర్శన హోమం జరిపించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే స్వామివారిని పల్లకిలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేపట్టారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఐరాల: సైబర్ నేరాలు పెరిగిపోయాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరసింహులు సూచించారు. బుధవారం మండలంలోని పొలకల సంతగేటులో స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలను అరికట్టవచ్చని వెల్లడించారు.

యాప్‌తో తెగుళ్ల సమస్యకు పరిష్కారం

గుడిపాల: పంటకు సోకిన తెగుళ్ల సమస్యను యాప్ ద్వారా పరిష్కరించవచ్చని జిల్లా మానవవనరు కేంద్రం అధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. బుధవారం మరకాలకుప్పం రైతుసేవా కేంద్రంలో సిబ్బందికి నేషనల్ పెస్ట్ సర్వలెన్స్, క్రాప్ లైఫ్ సిస్టమ్‌పై శిక్షణ ఇచ్చారు. చిత్తూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఉమ, ఏఓ మాధవి పాల్గొన్నారు.

ప్రజాసేవకే తొలి ప్రాధాన్యం

- కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్



చిత్తూరు అర్బన్: ప్రజాసేవకే తొలి ప్రాధాన్యమని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్ స్పష్టం చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'సాక్షి'తో పలు విషయాలు పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

- శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా చేజర్ల మండలం పెరుమాళ్లపోడు మా స్వగ్రామం. మా తండ్రి రైతు, అమ్మ గృహిణిఆ, నా సతీమణి ఎంబీబీఎస్ చేశారు. ఇద్దరు పిల్లలు. ఒక చెల్లెలు ఉన్నారు.
- వరంగల్ ఎన్‌ఐటీలో బీటెక్ (ఎలక్ట్రికల్) పూర్తిచేసి జర్మనీలోని ఓ కంపెనీలో అయిదేళ్ల పాటు పనిచేశా.
- సివిల్స్ రాసిన మూడుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లా. కానీ రాలేదు. 2016లో గ్రూప్స్‌లో రాణించడంతో మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యా. బద్వేల్‌లో నాలుగు నెలలు శిక్షణకాలంగా పనిచేశాను. తొలి పోస్టింగ్ అనంతపురం జిల్లా తాడిపత్రి, తర్వాత పుంగనూరు, ఇప్పుడు చిత్తూరుకు వచ్చా.
- కార్యాలయ పనివేళల్లో ప్రజలు ఎప్పుడైనా నన్ను కలిసి, సమస్య ఏదైనా ఉంటే నేరుగా చెప్పొచ్చు. వేచి ఉండాల్సిన అవసరం ఉండదు.
- కార్యాలయంలోని సిబ్బంది సక్రమంగా చేస్తే సమస్య ఉండదు. ప్రజల్ని తిప్పించుకోవడం నాకు నచ్చదు.
- నగరంలో నీటి సమస్య, పారిశుద్ధ్యంతోనే ఎక్కువగా ఇబ్బంది ఉందని తెలిసింది. అందరి సహకారంతో నగర అభివృద్ధికి కృషి చేస్తా.

ఇంటింటి సర్వే వేగవంతం



మాట్లాడుతున్న ఆర్‌డీఓ చిన్నయ్య

చిత్తూరు అర్బన్: స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేను మరింత వేగవంతం చేసి వందశాతం పూర్తి చేయాలని ఆర్‌డీఓ చిన్నయ్య, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్నికల సూపర్‌వైజర్లతో సమీక్షించారు. వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేను రెండురోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా ఒక కుటుంబంలోని సభ్యుల పేర్లన్నీ ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి నంబర్లు, ఓటరు పేర్లు, చిరునామాల్లో తప్పులు ఉంటే గుర్తించాలని చెప్పారు. అనంతరం పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు.

సాంస్కృతిక సంబరం

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని ఆస్థాన మండపంలో బుధవారం కళాకారులు సాంస్కృతిక సంబరం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు భరత నాట్యం, కూచిపూడి, భక్తి గీతాలు, పౌరణిక నాటికలు ప్రదర్శించారు. రావణబ్రహ్మణ వాహన ఉభయకర్తలు స్వామివారి ధ్వజస్తంభాన్ని సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

-ఐరాల/తవణంపల్లె



కళాకారిణుల నృత్యం



భజన చేస్తున్న బృందం



భక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

సర్వీస్ రోడ్డు కోసం నిరసన



నిరసన తెలుపుతున్న నేతలు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు– తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవేకు సర్వీస్ రోడ్డు, అండర్‌పాస్ నిర్మించాలని నిర్వాసిత రైతులు, సీపీఐ నేతలు బుధవారం నేషనల్ హైవే కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు మాట్లాడుతూ భూసేకరణ సమయంలో రైతులతో కుదుర్చుకున్న ఒప్పందాలను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీ నెరవేర్చకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అనంతరం నేషనల్ హైవే పీడీకి కార్తీక్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు మణి, విజయకుమార్, రఘు, విజయగౌరి, రమాదేవి, కుమారి పాల్గొన్నారు.


మల్బరీ సాగుపై అవగాహన

తవణంపల్లె: మండలంలోని పుణ్యసముద్రం రైతు సేవా కేంద్రంలో బుధవారం మల్బరీ సాగుపై అవగాహన కల్పించారు. పట్టు పరిశ్రమశాఖ ఏడీ మోహన్‌బాబు మాట్లాడుతూ నీటి వసతి ఉన్న వారు మల్బరీ సాగు చేపడితే అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం కూడా మొక్కలు, షెడ్ల నిర్మాణానికి రాయితీ ఇస్తుందని వెల్లడించారు. ఏఓ ప్రవీణ్ మాట్లాడుతూ పట్టుపురుగుల పెంపకంతో చక్కటి ఆదాయం సాధించవచ్చని తెలిపారు. పట్టుపురుగుల విక్రయానికి మదనపల్లె, పలమనేరులో మార్కెట్ సౌకర్యం ఉందన్నారు. సెరికల్చర్ అధికారి వెంకటసుబ్బమ్మ, సాంకేతిక అధికారి గణేష్ గౌడ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది జ్యోతి, సుహాసిని పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 5 ఫిర్యాదులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్, రూరల్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ సమస్యలపై 5 ఫిర్యాదులు వచ్చినట్లు ఈఈ హరి, మునిచంద్ర తెలిపారు. డీఈ శేషాద్రి, ఏఈలు కేశవచంద్ర, మాధురి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వీఆర్‌ఓ మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని టేకుమంద వీఆర్‌ఓ రాజ్‌కుమార్ బుధవారం మృతి చెందారు. మంగళవారం రాత్రి రక్తపోటు అధికం కావడంతో కుటుంబీకులు వెంటనే చీలాపల్లె సీఎంసీలో చేర్పించగా, చికిత్స పొందుతూ మరణించారు.

వరసిద్ధుని సేవలో మహంతు



ఓం ప్రకాష్‌దాస్‌కు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల/తవణంపల్లె: శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని తిరుమల హథీరాంజీ మఠం మహంతు ఓం ప్రకాష్‌దాస్ బుధవారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే మనుగడ



మొక్క నాటుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమని మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం కొంగారెడ్డిపల్లె పూల మార్కెట్ వద్ద మొక్కలు నాటారు. సహాయ కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటి కాపాడాలని కోరారు. అనంతరం డంపింగ్ యార్డ్, వార్డు సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, నరసింహ పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె: ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో బుధవారం కమనీయంగా పాండవులతో అమ్మవారి కల్యాణం నిర్వహించారు. ద్రౌపదీదేవి, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడి విగ్రహాలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా భాగవతారిణి స్వర్ణలత హరికథా కాలక్షేపం ఆకట్టుకుంది. రాత్రి ప్రదర్శించిన నాటకం అలరించింది.

కానిస్టేబుల్ దౌర్జన్యం

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేసిన ఘటనలో నిందితుడిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వన్ టౌన్ సీఐ జయరామయ్య కథనం మేరకు, ఈనెల 16వ తేదీ రాత్రి కట్టమంచికు చెందిన రమణ వన్ టౌన్ పోలీసులకు ఫోన్ చేశాడు. తన కుమారుడు రోహిత్ మద్యం తాగి గొడవ చేస్తున్నాడని చెప్పగా పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. గొడవ చేయొద్దని వారించినా రోహిత్ వినకుండా దౌర్జన్యం చేశారని, కానిస్టేబుల్ సీఐకి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువు కబ్జాపై ఫిర్యాదు



ఆక్రమిత భూమికి వేసిన ఫెన్సింగ్

పూతలపట్టు: మండలంలోని పోలవరం పంచాయతీ వెంకటాపురం సత్రంలో చెరువు భూమిని ఓ వ్యక్తి ఆక్రమించాడని గ్రామస్తులు బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారు తన భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు రెండు బోర్లు కూడా వేసుకున్నాడని ఆరోపించారు. చెరువు కింద 200 ఎకరాల ఆయకట్టు ఉందని, సుమారు 50 మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని డీటీకి విన్నవించారు.